క్లుప్తంగా

భారతీయతే మన వారసత్వం



భోగి గణపతికి పూజలు చేస్తున్న శ్రీనివాసరావు, ఆర్ఎస్ఎస్ నేత కృష్ణ

బోట్‌క్లబ్: భారతీయ సంస్కృతీ పరిరక్షణ వారసులుగా భారతమాత సేవతో ఆధ్యాత్మికత పొందాలని వాత్సల్యభారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దాలి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సూర్యారావుపేటలోని భోగిగణ పతిపీఠాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆర్ఎస్ఎస్ జోనల్ మీడియా ఇన్‌చార్జి నందూరి కృష్ణ మాట్లాడుతూ నైతిక సత్కర్మ దైవ పూజతో చేపట్టే ఆధ్యాత్మికతకు మించింది లేదన్నారు. భారతీయ తత్వంలో సద్గుణ సంపద గొప్పదన్నారు. కొండంత జ్ఞానం కంటే కాసింత ఆచరణ ముఖ్యమన్నారు. పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ గణపతి పీఠంలో భారతమాత విగ్రహ ప్రతిష్ఠ చేస్తామన్నారు.

మంత్రి అజయ్‌మిశ్రాను శిక్షించాలి

కాకినాడ సిటీ: లఖింపూర్ ఖేరి రైతు ప్రదర్శనలో నలుగురు రైతుల మృతి కేసులో నిందితుడైన బీజేపీ ఉప హోమ్‌శాఖామంత్రి అజయ్ మిశ్రాను, అతని కుమారుడు ఆశిష్ మిశ్రాను పదవులను నుంచి తొలగించి శిక్షించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కాకినాడలో నిరసన ప్రదర్శన చేసి, బ్లాక్ డే నిర్వహించారు. మంగళవారం కాకినాడ మెయిన్‌రోడ్డులోని ఎస్‌బీఐ శాఖ వద్ద బ్లాక్ డే నిర్వహించి నిందితులకు కొమ్ముకాస్తున్న మోడీ చిత్రపటాలను దగ్ధం చేశారు. రైతు సంఘ నాయకులు, కేంద్ర కార్మిక సంఘాల నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, వల్లు రాజబాబు, పప్పు ఆదినారాయణ, టేకుమూడి ఈశ్వరరావు, గొడుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి రూ.10 వేల సాయం



బాధిత కుటుంబానికి రూ.10 వేలు చెక్ అందజేస్తున్న జనరక్ష ప్రతినిధులు

కరప: కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మూడు నెలల బాలుడి కుటుంబానికి వేళంగి జనరక్ష స్వచ్ఛంద సేవాసంస్థ రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన పమ్మిరెడ్డి లక్ష్మీ త్రిమూర్తులు, దేవిల కుమారుడు వేణునాగ కార్తీక్ కొంతకాలంగా రక్త సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. అతడి వైద్యానికి అవసరమైన ఖర్చును, వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న సంస్థ కార్యదర్శి మాకినీడి హేమశ్రీ, అధ్యక్షుడు చక్కా వినయ్‌కుమార్ మంగళవారం జీజీహెచ్‌లో వారికి రూ.10 వేలు చెక్ అందజేశారు. అవసరమైతే రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి, వైద్యం చేయిస్తామని, బాధిత కుటుంబానికి వారు భరోసా ఇచ్చారు.

నేడు నగరానికి శౌర్య జాగరణ యాత్ర

బోట్‌క్లబ్: వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న శౌర్య జాగరణ యాత్ర బుధవారం నగరానికి చేరుకోనుందని పరిషత్ జోనల్ మీడియా ఇన్‌చార్జి నందూరి కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్ర ద్వారా యువతీ యువకులను, హిందూ సమాజాన్ని జాగృతం చేయనున్నట్లు చెప్పారు. యాత్రకు స్వాగతం పలికేందుకు పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా 'బిక్కిన'



విశ్వేశ్వరరావు

బోట్‌క్లబ్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బిక్కిన విశ్వేశ్వరరావును పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నియమించారు. ఈ మేరకు మంగళవారం ఆయన నియామక ఉత్తర్వులు అందుకున్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేస్తానన్నారు. విశ్వేశ్వరరావును బీజేపీ నాయకులు యార్లగడ్డ రామ్‌కుమార్, పైడా కృష్ణమోహన్‌తో పాటు పలువురు అభినందించారు.

క్లూస్ టీం పరిశీలన

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో చోరీ జరిగిన రెండు దుకాణాలను క్లూస్ టీం, క్రైం పోలీసు అధికారులు మంగళవారం పరిశీలించారు. సోమవారం కడారి మందుల దుకాణంలో రూ.7 వేలు, ఫ్యాన్సీ దుకాణంలో రూ.1.50 లక్షలు చోరీ అయిన ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీ జరిగిన ప్రాంతాల్లో వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు.

కొలువుకు సంసిద్ధంగా శిక్షణ

- నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా సాంకేతిక కళాశాలలు
- పాలిటెక్నిక్, ఐటీఐలలో విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు
- కోర్సు పూర్తి కాగానే నేరుగా ఉపాధి పొందేలా కార్యాచరణ
- కాకినాడ అర్బన్‌కు ఏపీటీ.. రూరల్‌కు ఐటీఐలో శిక్షణ కేంద్రాలు



సాంకేతిక శిక్షణలో ఐటీఐ విద్యార్థులు

బాలాజీచెరువు: విద్యార్థులు ఏ కోర్సు చేసినా వారిలో సరైన కమ్యూనికేషన్స్ స్కిల్స్ లేకపోవడంతో వారు ఉద్యోగ సాధనలో రాణించలేకపోతున్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు వేల కొద్దీ హాజరవుతున్నా, కేవలం పదుల సంఖ్యలో మాత్రమే ఉద్యోగాలు సాధిస్తున్నారని జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ స్వయంగా ప్రకటించింది. ఈ విషయాలు దృష్టిలో ఉంచుకుని సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం మహోన్నతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాకినాడ అర్బన్‌కు సంబంధించి ఆంధ్రాపాలిటెక్నిక్, రూరల్‌కు సంబంధించి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

పదో తరగతి పూర్తి చేసిన తరువాత రెండేళ్ల కోర్సు చేస్తే పక్కాగా ఉపాధి కల్పించే దిశగా నేడు ప్రాచుర్యం పొందిన కోర్సు ఐటీఐ. పేద, మధ్య తరగతి నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తూ ఈ సంస్థలు ఉపాధి మార్గాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పలు ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఈ కోర్సులు దోహదపడుతున్నాయి. విద్యా సంస్థ నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థి ఉద్యోగం, ఉపాధి పొందడమే లక్ష్యంగా సాంకేతిక విద్యారంగంలో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాకు ఒక స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ నైపుణ్యాభివృద్ధిని అందించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కాకినాడ, రూరల్ పరిధిలో ఒక ప్రభుత్వ, 3 ప్రైవేట్ ఐటీలు ఉండగా 800 సీట్లు ఉన్నాయి.

ట్రేడులు ఇలా..

ఐటీఐ కళాశాలల్లో ఎలక్ట్రికల్, ఫిట్టర్, టర్నర్, డీజిల్, మెకానికల్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్(సివిల్), కోపా, ఆర్‌అండ్‌సీ, ట్రేడులు ఉన్నాయి. ఏడాది, రెండేళ్ల వ్యవధి గల కోర్సుల్లో అభ్యర్థులు చేరితే శిక్షణ ముగిసాక ఏడాది పాటు అప్రంటిస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. డీజిల్ మెకానిక్, కోపా, వెల్డర్, ప్లంబర్ తదితర కోర్సులు ఏడాది కాలం కాగా, టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రికల్ కోర్సులు రెండేళ్ల వ్యవధి కలిగినవి. అలాగే ఐటీఐ రెండేళ్లు పూర్తిచేసిన వారు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో చేరడానికి అవకాశం ఉంటుంది.

ఐదో విడత ఐటీఐ అడ్మిషన్ల నిర్వహణ..



ఈ నెల 9వ తేదిన ఐటీఐలో మిగిలిన సీట్లకు ఐదో విడత అడ్మిషన్లు కల్పిస్తున్నాం. ఐటీఐ పూర్తి చేసిన వెంటనే నేరుగా పరిశ్రమలోకి వెళ్లి ఉద్యోగం చేయడంలో ఇబ్బందులు పడేకన్నా, శిక్షణ పొంది వెళ్లడం ద్వారా విధుల నిర్వహణ కష్టం కాకుండా ఉంటుంది. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రత్యేక స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వడం బాగుంది. ప్రతి ఇంటర్వ్యూల్లో విద్యార్థి స్కిల్స్ పరిశీలిస్తున్నారు. ముందుగానే వారికి శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగం త్వరగా పొందవచ్చు. నైపుణ్యాలు పెంచుకుంటే పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

– ఎం.వేణుగోపాల వర్మ, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్

శ్మశాన స్థలం ఆక్రమించి రహదారి!



పెనుగుదురులో శ్మశాన స్థలం పక్కన వేస్తున్న రహదారి

కరప: మండలం పెనుగుదురులో శ్మశాన స్థలాన్ని ఆక్రమించడమే కాక రోడ్డు వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ–రామచంద్రపురం ప్రధాన రహదారిలో ఉన్న పెనుగుదురు శ్మశానానికి, పుంతరోడ్డుకు మధ్య మట్టపర్తి అనంతలక్ష్మికి జిరాయితీ భూమి ఉంది. ఇటీవల జరిగిన భూరక్ష రీసర్వే అనంతరం ముక్కురాళ్లు కూడా పాతారు. అయితే ఆ స్థల యజమాని మెయిన్ రోడ్డు నుంచి తన స్థలంలోకి రోడ్డు వేస్తుండడంతో గ్రామస్తులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి బి.చంద్రకళ, వీఆర్వో పి.ఆదినారాయణలకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు ఆ స్థలాన్ని పరిశీలించి సంబంధిత పత్రాలను తీసుకువస్తే బుధవారం సర్వే చేయిస్తామని, అంతవరకు పనులు నిలిపివేయాలని హెచ్చరించారు.

వాహన చోదకులకు డ్రైవింగ్, ఆర్సీ కార్డులు



రవాణాశాఖ కార్యాలయంలో ప్రారంభమైన కార్డుల ప్రింటింగ్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లాలో వాహన చోదకుల లైసెన్స్, ఆర్సీ కార్డులు త్వరలో పంపిణీ కానున్నాయి. గత ఏడాది సెప్టెంబర్ నుంచి పెండింగ్‌లో ఉన్న దాదాపు 60 వేల కార్డులు ప్రింట్ చేసి వరుస క్రమంలో పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు తొలి విడతలో 10 వేల కార్డులు రావడంతో ప్రింటింగ్ ప్రారంభించి స్పీడ్ పోస్టు ద్వారా వారి చిరునామాకు పంపడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అన్నీ డిజిటల్ విధానాన్ని ప్రారంభించిన నేపథ్యంలో రవాణాశాఖ ఈ ఏడాది ఆగస్టు నుంచి సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. వాహన చోదకులకు రవాణాశాఖ జారీ చేసే డ్రైవింగ్, ఆర్సీ కార్డుల స్థానంలో సంబంధిత యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న పత్రమే సరిపోతుంది. కాగా ఈ ఏడాది జులై 31 వరకు కార్డు ఫీజు 225 రూపాయలు వసూలు చేసిన విషయం తెలిసిందే. వారికి మాత్రమే ఈ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఆగస్టు నుంచి కార్డులు నిలిపివేసి, రవాణాశాఖ వెబ్‌సైట్ నుంచి కేవలం ప్రింట్ మాత్రమే డౌన్లోడ్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రవాణాశాఖకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వాహన్ పరివార్ సేవలన్నీ ఇప్పటికే ఆన్‌లైన్ చేయడంతో చాలా రాష్ట్రాలో కార్డులు తొలగించి డిజిటల్ విధానంలో పత్రాలు తీసుకురాగా ఇప్పుడు ఏపీలో అమల్లోకి తెచ్చారు. రవాణాశాఖ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్//ఏపీఆర్‌టీఏసీ సిటిజన్.ఈ ప్రగతి.ఓఆర్‌టీ ఫారం 6 లేదా 23ని డౌన్‌లోడ్ చేసుకుని ధ్రువపత్రాన్ని తీసుకోవాలి. లేదా ఏపీఆర్‌టీఏసిటిజన్ ఆండ్రాయిడ్ మొబైల్ ద్వారా యాప్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాహనాలు తనిఖీ చేసేటప్పుడు పోలీస్, లేదా రవాణాశాఖాధికారులకు డౌన్‌లోడ్ చేసిన పత్రాలు చూపిస్తే సరిపోతుంది. వీటిని అనుమతించాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

చంద్రబాబుది అక్రమాల దీక్ష

- వైఎస్సార్ సీపీ మహిళా నేత జమ్మలమడక



కాకినాడ రూరల్: చంద్రబాబుది నిరాహార దీక్ష కాదని, నిరంతర అక్రమాల దీక్ష అని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టరు జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా స్కిల్ స్కాంలో నిందితుడిగా రిమాండ్‌లో ఉన్న చంద్రబాబు జైలు ఉండి నిరాహార దీక్ష చేయగా ఆయన భార్య భువనేశ్వరి సత్యాగ్రహం అంటూ దీక్ష చేయడం చూస్తుంటే విడ్డూరంగా ఉందని ఆమె తెలియజేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అన్యాయాలు, అక్రమాలు జరిగితే స్పందించని భువనేశ్వరి ఇప్పుడు భర్త కోసం గాంధీయవాదులుగా ప్రకటించుకోవడంపై సభ్య సమాజం సిగ్గుపడుతోందన్నారు. ప్రచార ఆర్భాటం కోసం పుష్కరాల్లో 29 మందిని పొట్టన పెట్టుకుంటే స్పందించని భువనేశ్వరి ఇప్పుడు తన భర్త అక్రమాల నుంచి ప్రజల దృష్టి మార్చేందుకు చూస్తున్నారన్నారని విమర్శించారు. చట్ట ప్రకారమే వ్యవస్థలు పనిచేస్తాయని, చట్టానికి చంద్రబాబు అతీతుడు కాదన్నారు. నిరాహార దీక్ష ద్వారా గాంధీ మహాత్ముడిని అవమాన పరిచారన్నారు.

సమగ్ర ఓటరు జాబితా రూపకల్పన

- ఈఆర్వో, ఆర్డీఓ సత్యనారాయణ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: రూరల్ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎన్‌వీవీ సత్యనారాయణ ఓటర్ల జాబితాకు సంబంధించి రాజకీయ పార్టీ ప్రతినిధులతో మంగళవారం ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్ ప్రకటించిన ప్రతిపాదిత షెడ్యూల్ వివరించి ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం 6, 7, 8లలో ఆమోదించిన వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశామన్నారు. సమావేశంలో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, ఎస్.అప్పారావు, గదుల సాయిబాబా, నాగేశ్వరరావు, శివ, కరప తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ పార్థసారధి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

27న డ్రాఫ్ట్ నోటిఫికేషన్

కాకినాడ: ఓటర్ల జాబితా సవరణ–2023లో భాగంగా ఈ నెల 27న తొలి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్, ఈఆర్వో సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీలతో సమావేశం జరిగింది. ఈఆర్వో మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన ప్రగతిని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. సిటీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాలో మార్పులు–చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాలకు సుమారు 69,220 అభ్యర్థనలు రాగా, సుమారు 50 వేలను పరిష్కరించామన్నారు. ఓటర్ల జాబితాలో ఉండి ఆయా చిరునామాల్లో అందుబాటులో లేని 13,040 మందిని గుర్తించామన్నారు. వీరికి రిజిస్టర్డ్ పోస్టు ద్వారా నోటీసులు ఇచ్చినట్టు కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతాపతిరావు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, రాగిరెడ్డి సుబ్బారావు, టీడీపీ ప్రతినిధి తుమ్మల రమేష్, బీఎస్పీ ప్రతినిధి అప్పారావు, ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు.

ఉచిత వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

బోట్‌క్లబ్: రోటరీక్లబ్ ఆఫ్ కాకినాడ సన్‌రైజ్ క్లబ్, కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కెప్టెన్ ఎం. జాకబ్ సత్యరాజ్ ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు కమల్ సందీప్ మాట్లాడుతూ సమాజంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే రోటరీ ఆశయమన్నారు. అనంతరం 150 మంది రోగులను పరీక్షించి వారికి కావాల్సిన మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నగధర్, క్లబ్ సభ్యులు ఎం.సత్యకుమార్, ఎం.సుబ్రహ్మణ్యం, ఏవీ రంగారావు పాల్గొన్నారు.

'తురగా' దంపతులకు సత్కారం



సూర్యారావు దంపతులను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

బాలాజీచెరువు: సాహితీవేత్త, కళాకారుడు తురగా సూర్యారావు, శేషకుమారి దంపతులను హైదరాబాద్ కేసీ దాస్ ట్రస్ట్ 12వ వార్షికోత్సవంలో సత్కరించారు. ఏకపాత్రాభినయం, పాటలు, హాస్య నాటికలు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి భారతమ్మపై రాసిన కవిత ఆలవోకగా చెప్పడంతో సూర్యారావును ట్రస్ట్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి, జయలక్ష్మి సత్కరించి షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా సూర్యారావును మిర్తిపాటి వెంకటరామయ్య, కాకినాడ జోన్ కన్వీనర్ దర్భా భాస్కరశర్మ అభినందించారు.

కులమతాలకు అతీతంగా పథకాలు

- అండగా ఉన్నాం ఆశీర్వదించండి
- 'గడప గడప'లో ఎమ్మెల్యే కన్నబాబు



ఎఫ్‌సీఐ కాలనీలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: అర్హులందరికీ ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందించామని, మీ అందరికీ అండగా ఉన్నాం, ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు లబ్ధిదారులను, ప్రజలను కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా రమణయ్యపేట పంచాయతీ సచివాలయం–4 పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, జనచైతన్యకాలనీ, పాతగైగోలుపాడు పెంకే వారి కాలనీలో మంగళవారం సాయంత్రం పర్యటించారు. స్థానిక నాయకులు, వైఎస్సార్ సీపీ రమణయ్యపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగా సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిక నరసింహమూర్తి, ఎఫ్‌సీఐ కాలనీ నాయకుడు దేవుపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ పర్యటించి సంక్షేమ పథకాలు వివరించారు. అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌సీఐ కాలనీ కమ్యూనిటీ హాలులో జరిగిన సమావేశంలో సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీల నిర్మాణం, వేలాడుతున్న విద్యుత్ తీగల తొలగింపు వాటర్ ట్యాంక్ నిర్మాణం, పార్కు ఏర్పాటు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రెండు మూడు రోజుల్లోనే విద్యుత్‌తీగల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డ్రైనేజీల నిర్మాణానికి ఒక్క ఎఫ్‌సీఐ కాలనీలోనే 5.8 కోట్లు వ్యయం అవుతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారని, తొలి విడతగా ప్రాధాన్యాన్ని గుర్తించి కొన్ని డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. వాటర్‌ట్యాంకర్ ఏర్పాటుతో పాటు పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జనచైతన్య లే అవుట్‌లో, పెంకే వారి కాలనీలో ప్రజలను కలసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రమణయ్యపేట గ్రామ పరిధిలోని సచివాలయం–4 పరిధిలో నాలుగు రోజుల పాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. గడపగడపకు కార్యక్రమంలో మంజూరయ్యే నిధులతో ప్రజలు విన్నవించుకునే సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణమే ఖర్చు చేస్తామన్నారు. పొరుగుపచ్చగా ఉంటే చూడలేని పచ్చ మీడియా, పచ్చ పార్టీ నాయకులు సంక్షేమ ప్రభుత్వంపై అవాకులు, చవాకులు వేయాలని చూస్తుందని, ప్రజలు గుర్తించి వైఎస్సార్ సీపీకి అండగా ఉండడంతో పాటు ఎన్నికల సమయంలో వచ్చే ఇతర పార్టీల నాయకులకు తగిన రీతిలో గుణపాఠం చెప్పాలన్నారు. డీఎల్‌డీవో నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి దవులూరి వెంకటరమణ, సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ, పార్టీ నాయకులు గుబ్బల విజయ్, గుత్తుల సత్తిబాబు, మేడిశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

- కమిషనర్ నాగనరసింహారావు
- నేటి నుంచి శిబిరాల నిర్వహణ
- కొండయ్యపాలెం పీహెచ్‌సీ పరిశీలన



ఆరోగ్య సురక్షకు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు



వేళంగి వైద్యశిబిరంలో మందులు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీ

కాకినాడ: ప్రజలకు దగ్గరగా ఆరోగ్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. స్థానిక కొండయ్యపాలెంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఆరోగ్య సురక్షపై అక్కడి పీహెచ్‌సీని కమిషనర్ మంగళవారం సందర్శించారు. శిబిరాల నిర్వహణ, అందించాల్సిన సేవలు, రోగులకు కల్పించాల్సిన సదుపాయాలపై సిబ్బందికి సూచనలిచ్చారు. కార్పొరేషన్ పరిధిలో సురక్ష శిబిరాలను వివిధ ప్రాంతాల్లోని 13 యుపీహెచ్‌సీలలో వేర్వేరు తేదీల్లో నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ కృతికాశుక్లా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో పాటు పలువురు అధికారులు, ప్రజాతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఏఎన్ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని యుపీహెచ్‌సీకి పంపిస్తారన్నారు. అక్కడి శిబిరంలో రక్త పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తామని, అవసరమైన వారిని ప్రభుత్వాస్పత్రికి సిఫార్సు చేస్తామన్నారు. ప్రభుత్వం కల్పిస్తోన్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. శిబిరంలో ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వం ద్వారా అందించే వైద్య సేవలకు సంబంధించి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకునే అంశంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆయన వెంట నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, జిల్లా ప్రోగ్రాం అధికారి పావని, ఈఈ మాధవి, ఏఈ రమేష్, మెడికల్ ఆఫీసర్ ఉదయశ్రీ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సత్తెప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

కరప: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వరమని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు అన్నారు. మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సర్పంచ్ సవిలే నీలిమ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుంటూ, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీపీ కోరారు. ఈ శిబిరానికి 410 మంది వచ్చి పేర్లను నమోదు చేయించుకున్నారు. కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ ఈ.సింధూర, వైద్య నిపుణులు పరీక్షలు చేసి, మందులు రాసి ఇచ్చారు. కంటిపరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటుచేసి, అందరికీ అవగాహన కల్పించారు. డాక్టర్ బొండా వెంకన్నారావు, స్థానిక నాయకులు, అధికారులతో కలసి ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు కేస్‌షీట్, మందులుతో కూడిన సురక్ష బ్యాగులను పేషంట్లకు అందజేశారు. ఉప సర్పంచ్ కె.అయ్యన్న, గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాస్, ఆరోగ్యమిత్ర వంచెర్ల వీరభద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, ఎస్.రాజేష్, జె.దుర్గారావు, జి.జెమ్మి, వి.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీలో ఉచిత శిక్షణ

బాలాజీచెరువు: అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్)లో అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులు ఉచితంగా అందజేయనున్నట్లు ఎస్‌డి ప్రిన్సిపాల్ డాక్టర్ అనంతలక్ష్మి తెలిపారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (న్యూఢిల్లీ) ఆమోదం పొందిన ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం ద్వారా డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులు ఉచితంగా ఇస్తారన్నారు. మూడో విడత శిక్షణ ఇచ్చేందుకు ఇంటర్మీడియట్, డిప్లమా (పాస్), డిగ్రీ విద్యార్థులు బాలికలు, మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కోర్సులు అక్టోబర్ 6వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, శిక్షణ కాలం 2 నెలలు ఉంటుందని, ఈ కోర్సులో ప్రవేశానికి ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదన్నారు. శిక్షణ కాలం పూర్తయిన తర్వాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ ఇస్తారని, ఆసక్తి గల అభ్యర్థులు 98662 66371 నంబరును సంప్రదించాలని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ మల్లెల సువర్చల తెలిపారు.

స్వేచ్ఛ వైపు నిర్మలంగా సాగిపోయింది..



నిర్మల నాటకంలోని ఒక సన్నివేశం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): పంతం పద్మనాభం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిరంలో జరుగుతున్న నాటక పోటీల్లో భాగంగా మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన కళాకారులు ప్రదర్శించిన నిర్మల నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆకురాతి భాస్కర్ చంద్ర రాసిన ఈ నాటకంలో పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. పీతాంబరం ఒక అతి సామాన్య గుమస్తా. తన ఆలోచనలు చాలా ఉన్నతంగా ఉన్నాయనుకునే పురుషాధిక్య స్వభావి. భార్యంటే ఆధునికంగా ఉండాలనుకుంటాడు కానీ, పాతకాలపు స్త్రీలా ఉంటే మనసులో సంతోషిస్తూ ఉంటాడు. అతని భార్య నిర్మల ఆధునిక భావాలు కలది. ఆమెను అణగదొక్కేలా పీతాంబరం వ్యవహరిస్తుంటాడు. చివరికి తనకేం కావాలో నిర్ణయించుకుని అతని సాయం తీసుకుని ఆధునికతవైపు పయనం సాగిస్తుంది ఆమె. ఆద్యంతం చక్కని నటన ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు పాత్రధారులు.